క్లుప్తంగా

7న వైఎస్సార్‌సీపీ సమావేశం

కోడుమూరు రూరల్‌: వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ ఆదిమూలపు సతీష్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడా మాజీ చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన సతీష్‌ కోరారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా నోడల్‌ అధికారి డాక్టర్‌ రఘు

కల్లూరు: గ్రామాల్లో ప్రజలు టీబీ పరీక్షలు చేసుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్‌ అధికారి డాక్టర్‌ రఘు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పర్ల గ్రామంలో టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి టీబీ జబ్బు లేని సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీబీ పాజిటివ్‌ వచ్చిన వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ శ్రీదేవి, అరుణ జ్యోతి, చంద్రయ్య, ఈశ్వరయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నదితీర గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటన



కొత్తకోట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్‌: మండల పరిధిలోని నదీతీర గ్రామాల్లో ఎంపీడీఓ రాణెమ్మ పర్యటించారు. ఆమె శుక్రవారం కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్‌దొడ్డి, కొండాపురం, గుండ్రేవుల, సంగాల గ్రామాల్లో పర్యటించి సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, వసతులు, సౌకర్యాలు తదితర అంశాలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి నిర్వహణపై ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీలకు సూచనలు చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలలకు అందుతున్న పౌష్టికాహారాన్ని తనిఖీలు చేశారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.


ఉచితంగా నట్టల నివారణ మందులు



మాట్లడుతున్న శ్రీనివాసులు

పాణ్యం: గొర్రెల పెంపకందారులకు ఉచితంగా నట్టల నివారణ మందలు అందిస్తున్నట్లు ఉమ్మడి కర్నూల్‌ జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చెర్మన్‌ కేపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పాణ్యంలోని గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మూడునెలలకోసారి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గొర్రెల అభివృద్ధికి తీసుకోవల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్‌ శ్రీనివాసరావు, రవిప్రకాస్‌రెడ్డి, ఏడీఏ కమలాకర్‌, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ బోల్తా



కొండపై నుంచి కింద పడ్డ ట్యాంకర్‌

పాణ్యం: మండల పరిధిలోని ఘాట్‌ రోడ్డులో ఓ సిమెంట్‌ ట్యాంకర్‌ బోల్తా పడింది. హైవే పోలీసు లు తెలిపిన వివరాల మేరకు.. సిమెంట్‌నగర్‌ నుంచి పాణ్యం వైపు సిమెంట్‌ ట్యాంకర్‌ బయలుదేరింది. ఘాట్‌ రోడ్డులోని మలుపు వద్ద ఆ వాహ నం అదుపుతప్పి కొండపై నుంచి కిందకు పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ధాన్యం సొమ్ము ఇంకెప్పుడు!

- మద్దతు ధరకు 1200 క్వింటాళ్లకుపైగా జొన్నల కొనుగోలు
- రెండు నెలలు కావస్తున్నా రైతులకు అందని డబ్బు
- గడివేముల మండలంలోనే రూ. 4 కోట్లకు పైగా బకాయిలు
- సర్కారు తీరుతో ఖరీఫ్‌ సాగుకు పెట్టుబడి లేక అన్నదాతల అవస్థలు



కరిమద్దెల గ్రామంలో జొన్నలను కొనుగోలు చేస్తున్న జిల్లా, మండల స్థాయి అధికారులు (ఫైల్‌)

గడివేముల: గత రబీ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ధాన్యం డబ్బులను సర్కారు నేటికి ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఖరీఫ్‌ సాగు పనులు ప్రారంభమయ్యాయి. పంటసాగుకు పైసలు కావాలి. చేతిలో చూస్తే చిల్లిగవ్వ లేదు. గతేడాది రబీలో పండించిన జొన్నదిగుబడులను ప్రభుత్వం మేనెలలో సివిల్‌ సప్లై ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసింది. క్వింటం రూ. 3, 370 చొప్పున ఒక గడివేముల మండలంలోనే 1200 క్వింటాళ్లకు పైగా సేకరించింది. ఇందుకు సంబంధించి రైతులకు రూ. 4 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. అయితే,రెండు నెలలు గడిచినా ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు జరిగిన పదిరోజుల్లోనే డబ్బు అందేది. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో తీవ్ర జాప్యం చేస్తుందని కర్షకులు మండిపడుతున్నారు.

అప్పులు తీర్చలేక అవస్థలు

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్‌ పంట పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు సాగుకి సన్నద్ధవుతున్నారు. కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా మోసపోతూనే ఉన్నామని వారు వాపోతున్నారు. రబీలో పండించిన జొన్న పంటను కొనుగోలు చేసి నేటికీ సొమ్ము ఇవ్వకపోతే ఎలా బతికేదని వారు నిలదీస్తున్నారు. పొలాన్ని నమ్ముకుని పంటలను సాగు చేస్తే ఆదాయం మాట దేవుడేరుగు పెట్టుబడికి కోసం తెచ్చుకున్న అప్పులను తీర్చలేక కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ఎరువులు,మందులు,పెట్టుబడి కోసం తెచ్చుకున్న వాటికి వడ్డీలు అధికం కావడంతో తీర్చలేక నానా అవస్థలు పడుతున్నట్లు బాధితరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు స్పందించి వెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలని లేకపోతే తాము రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి వస్తుందని బాధిత రైతులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి



నేను గత మే నెలలో 80 క్వింటాళ్ల జొన్న పంటను మద్దతు ధర రూ. 3370 ప్రకారం విక్రయించాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు అందుకు సంబంధించిన డబ్బులు పడలేదు. కూటమి ప్రభుత్వం రైతుల ను సమస్యల్లోకి నెడుతోంది. పాలకులు మా జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. సొమ్ము చెల్లింపు జరిగేలా చూడాలి.

–చింతల నారాయణ,గడిగరేవుల గ్రామం.

వడ్డీలు పెరుగుతున్నాయి



గత రబీలో నేను పది ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. కూటమి ప్రభుత్వం జొన్న పంటకు మద్దతుధర ప్రకటించింది. దీంతో ఎంతో కొంత లాభం వస్తుందని 96 క్వింటాళ్లను మే 21వ తేదీన అమ్ముకున్నాను. నేటికీ సొమ్ము జమ కాలేదు. అధికారులను అడుగుతుంటే ఇదిగో,అదుగో అంటూ చెబుతున్నారు. సొమ్ములు ఎప్పటికి జమ అవుతాయో తెలియడం లేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి.

– నగిరి రమణమూర్తి, జొన్న రైతు, గడిగరేవుల

స్పందించి ఆదుకోవాలి



మేము 175 క్వింటాళ్ల జొన్నను మే 8న విక్రయించాం. ఇంత వరకు డబ్బులు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంతలో ఖరీఫ్‌ ప్రారంభం కావడంతో అప్పులు తెచ్చి సోయాబీన్‌, మినుము సాగు చేశాను. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి లాభం లేకుండా పోయింది. తెచ్చిన అప్పులకు వడ్డీలు లెక్కచేస్తే ప్రైవేట్‌ వ్యాపారులకు అమ్ముకున్నా మేలయ్యేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి రైతులను ఆదుకోవాలి.

– గోపాలయ్య, గడిగరేవుల

అర్హులైన రైతులను గుర్తించండి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జయప్రకాష్‌రెడ్డి

పాణ్యం: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులను గుర్తించి జాబితాలో చేర్చాలని మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్‌ నరేంద్రకుమార్‌రెడ్డి, ఏఓ జయప్రకాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ , రెవెన్యూ సిబ్బందికి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 13,084మంది రైతులు ఉన్నారన్నారు. వీరిలో 10, 700మంది ఇప్పటికే అర్హత సాధించినట్లు తెలిపారు. 1391మంది వివిధ కారణాలతో తొలగింపునకు గురైనట్లు తెలిపారు. మిగిలిన 793 మంది రైతులకు సంబధించి రెవెన్యూ సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అనంతరం వ్యవసాయ పంట నమోదు పూర్తి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బకాయిలు విడుదల చేయాలి



కోడుమూరులో ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు, విద్యార్థులు

కోడుమూరు రూరల్‌: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్‌, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌, వసతి దీవెన బకాయిలు రూ.6400 కోట్లను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్న డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోడుమూరులోని అంబేడ్కర్‌ సర్కిల్‌లో ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వం రూ.6400 కోట్లు బకాయి పడిందన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తి చేసుకున్నా విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. గత అక్టోబరులో మంత్రి నారా లోకేష్‌ పెండింగ్‌ బకాయిలు చెల్లిస్తున్నామంటూ ఇచ్చిన మాటలు పత్రిక ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌ బకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, స్థానిక నాయకులు అల్తాఫ్‌ బాషా, మహేంద్ర, శ్రీకాంత్‌, నందకిశోర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న జేడీఏ వరలక్ష్మి

ఓర్వకల్లు: ఎరువుల వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు పీఎల్‌ వరలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండల ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జేడీఏతో పాటు, సహాయ సంచాలకులు శాలురెడ్డి, విజిలెన్స్‌ ఏడీఏ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో ఎరువుల కొనుగోలు జోరందుకుందన్నారు. ఎరువులు, నీళ్ల మందులు, విత్తన దుకాణాదారులు నిర్ణీత గడువులోగా తమ లైసెన్సులను రెన్యూవల్‌ చేయించుకోవాలని సూచించారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని రసాయన ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలను అంటగట్టినా, విచ్చలవిడిగా నీళ్లమందులను విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల వద్ద స్టాక్‌ వివరాలతో కూడిన నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, భాస్కర్‌, వివిధ రైతు సేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైనా అజమాయిషీనే!

కర్నూలు(రూరల్‌): మండల పరిధిలోని పూడూరు జెడ్పీ హైస్కూల్‌ ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్‌కు గురైనా స్కూల్‌ రికార్డ్స్‌ అప్పగించడం లేదని ఇన్‌చార్జ్‌ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌.రాజు అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. హైస్కూల్‌ హెచ్‌ఎంగా ఉన్న శేషఫణి రాజు సీసీఏ నిబంధనలకు విరుద్ధంగా న్యాయ విద్య అభ్యసించినందుకు గత ఏప్రిల్‌లో డీఈఓ శామ్యూల్‌పాల్‌ సస్పెండ్‌ చేశారన్నారు. హైస్కూల్లో సీనియర్‌ ఉపాధ్యాయుడిగా ఉన్న తనకు ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. అయితే సస్పెన్షన్‌కు గురైన శేషఫణిరాజు స్కూల్‌కు సంబంధించిన రికార్డులు, విద్యాకమిటీ రికార్డులు, నాడు -నేడు కమిటీ రికార్డులు, అటెండెన్స్‌, మార్కుల రికార్డులు, హైస్కూల్‌ బ్యాంక్‌ ఖాతా పాస్‌బుక్‌ వంటివి తన ఆధీనంలోనే ఉంచుకొని హైస్కూల్‌ అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని వివరించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో హైస్కూల్లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఈ నెల 10న మెగా పేరెంట్స్‌ మీటింగ్‌ నిర్వహించేందుకు ప్రభుత్వం హైస్కూల్‌ గ్రాంట్‌ రూ.25 వేలు మంజూరు చేసిందని, వాటిని విత్‌డ్రా చేసేందుకు బ్యాంకు పాస్‌ పుస్తకం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టి సస్పెన్షన్‌కు గురైన హెచ్‌ఎం నుంచి హైస్కూల్‌ రికార్డులు స్వాధీనం చేసుకొని విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడలని కోరారు.

ప్రమాదాల నివారణకు మాక్‌డ్రిల్‌



మాక్‌డ్రిల్‌ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్‌): కర్నూలు మండల పరిధి గొందిపర్ల గ్రామంలోని టీ.జీ.వీ ఆల్కలీస్‌ పరిశ్రమలో శక్రవారం కర్నూలు పరిశ్రమల డిప్యూటీ చీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఐ.నారాయణ రెడ్డి, కర్నూలు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వై.చిన్న బజారి ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు మాట్లడుతూ.. ఫ్యాక్టరీలో మిథనాల్‌ లీకై అగ్ని ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలి, మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి, మంటలను ఎలా అదుపుచేయాలనే అంశాలపై ఫ్యాక్టరీ యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు. మాక్‌ డ్రిల్‌ అనంతరం సమీక్ష నిర్వహించి గుర్తించిన లోపాలపై తగు సూచనలు చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు, మ్యుచువల్‌ ఎయిడ్‌ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి




రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్‌

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులకు రుచికర భోజనం పెట్టాలని ఎంఈఓ–2 ఓంకార్‌ యాదవ్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలకొలను, చింతలపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి, మధ్యాహ్న భోజనం తయారీలో వంట నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోజువారి మెనూను పరిశీలించారు. అనంతరం ఓంకార్‌ యాదవ్‌ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేట్‌ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు షాన్‌వాజ్‌, రసూల్‌ ఖాన్‌ పాల్గొన్నారు.

ఘనంగా కొండలయ్య సరిగెత్తు







కొత్త, పాత కొండలయ్య పీర్ల సరిగెత్తు, చిన్న సరిగెత్తుకు ముస్తాబైన చిన్న ఇమాం ఖాశీం పీరు, గొల్లలదొడ్డిలో చందమామయ్య పీరుకు మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్న భక్తులు

సి.బెళగల్‌: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నిర్వహించిన కొండలయ్య సరిగెత్తు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం రాత్రి జరిగిన సరిగెత్తుకు గ్రామస్తులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలో ప్రతిష్ఠించుకున్న కొత్త కొండలయ్య, పాత కొండలయ్య, కోసిక దేవుళ్ల పీర్లను తెల్లవారుజామున 5 గంటలకు మసీద్‌ నుంచి బయటకు తీసుకెళ్లి, కోట వీధిలో ఉన్న దస్తగిరయ్య స్వాముల దర్గాలో చదివింపులు చేశారు. అదేవిధంగా కోటవీధి, తెలుగు వీధులలోని ఇళ్లకు వెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా తెలుగు వీధిలో ఉన్న సంతానమ్మ, పెద్ద దేవుడి, కంతమలయ్య చావిడులలో చదివింపులు చేశారు. గ్రామంలో ఊరేగించి పాత బస్టాండ్‌లో సవారీ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పీర్ల దేవుళ్లను మసీద్‌లలో తిరిగి ప్రతిష్ఠించారు.



గొల్లలదొడ్డిలో చందమామయ్య పీరును దర్శించుకుంటున్న భక్తులు

చిన్న సరిగెత్తుకు సర్వం సిద్ధం

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఆయా గ్రామాలలో చిన్న సరిగెత్తును భక్తులు నిర్వహించుకోనున్నారు. సి.బెళగల్‌, గొల్లలదొడ్డి, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల పీర్ల చావిడీల (మసీద్‌)లో వెలసిన పీర్ల దేవుళ్లను నిర్వాహకులు పూలమాలలు, విద్యుత్‌ బల్బులతో సుందరంగా తీర్చిదిద్దారు. చిన్న సరిగెత్తు వేడుకల్లో భాగంగా గొల్లలదొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లో చందమామయ్య, సి.బెళగల్‌లో చిన్న ఇమాంఖాశీం దేవుళ్లకు భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే ఉత్సవాలు శుక్రవారం రాత్రంతా జరుగుతాయని మసీదు పెద్దలు తెలిపారు.శనివారం తెల్లవారుజామున పీర్ల ఊరేగింపు ఉంటుందని గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

పెసరవాయిలో పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు

గడివేముల: మండల పరిధిలోని పెసర వాయి గ్రామంలో మొహర్రం సందర్భంగా కొలువైన అలీ అక్బర్‌, మౌలాలి, హసన్‌ హుస్సేన్‌ స్వామి పీర్లను నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అంతకుముందు పెసరవాయి గ్రామానికి వచ్చిన కాటసానిని మండల నాయకులతో పాటు గ్రామవైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌ బి. చంద్రశేఖర రెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ శేఖర్‌, ఎంపీటీసీ సైమన్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు శివరామి రెడ్డి, ఎల్లారెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, దేశం నాగేశ్వర రెడ్డి, రమేష్‌,డాలు స్వామి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



పెసరవాయిలో పీర్లను దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కొలువుదీరిన పీర్లస్వాములు

భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కల్లూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం పుసులూరు గ్రామంలో వెలసిన పెద్దస్వామి, దర్గా స్వామి, పీర్లస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. తడకనపల్లెలో శనివారం తెల్లవారుజామున చిన్న సరిగెత్తు ఇమాం ఖాసీంలతో మొహర్రం ప్రారంభమవుతుందని నిర్వహకులు తెలిపారు. అదే రోజు సాయంత్రం దస్తగిరి స్వామి, సోమవారం తెల్లవారుజామున మౌలాలిస్వామి సరిగెత్తు ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం పీర్లు ఏటికి వెళ్తాయన్నారు. బస్తిపాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున మౌలాలి స్వామి, ఆదివారం తెల్లవారుజామున పెద్దయ్య స్వామి సరిగెత్తు, సోమవారం తెల్లవారుజామున దస్తగిరిస్వామి సరిగెత్తు ఉంటుందని గ్రామస్తులు వెల్లడించారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

త్యాగానికి గుర్తు మొహర్రం వేడుక అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం పుసులూరు గ్రామంలో వెలసిన పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’పై సమావేశం

కల్లూరు: కర్నూలు నగరంలోని కేఎస్‌ఆర్‌ కన్వెన్షన్‌ (హ్యాంగ్‌ అవుట్‌ హోటల్‌)లో బాబు ష్యూ రిటీ మోసం గ్యారెంటీపై పాణ్యం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గని చెరువు పరిశీలించిన ఎమ్మెల్యే



గని చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

గడివేముల: మండలంలోని గని గ్రామ సమీపంలో ఉన్న చెరువును శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పరిశీలించారు. గని గ్రామ చెరువుకు తూము సౌకర్యం ఏర్పాటు చేస్తే దాదాపు 800 నుంచి వెయ్యి ఎకరాల దాకా పంటలకు సాగునీరు అందుతుందని రైతులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి గని చెరువుకు తూము ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, హర్షవర్ధన్‌, రైతులు పాల్గొన్నారు.


విద్యాశాఖ కమిషనర్‌ ఏకపక్ష నిర్ణయాలు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్‌ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌ ఏకపక్ష నిర్ణయాలతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏపీటీఎఫ్‌ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్‌ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఐదు ఐచ్ఛిక సెలవులను పాఠశాలలకు సెలవులుగా ప్రకటించుకునే విధానం చాలా కాలం నుంచి ఉందన్నారు.. అయితే, కమిషనర్‌ శనివారం మొహర్రం పండుగకు సంబంధించిన ఐచ్ఛిక సెలవును 50 శాతం ఉపాధ్యాయులు మాత్రమే ఉపయోగించుకోవాలని చెప్పడం సరి కాదన్నారు. రాష్ట్రంలో చాలావరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని వీరు ఐచ్ఛిక సెలవును ఎలా ఉపయోగించుకుంటారని ప్రశ్నించారు. పండుగలు అనేవి ఉపాధ్యాయులకు మాత్రమే కాదని విద్యార్థులకు కూడా సంబంధించిన అంశమనే విషయాన్ని ఉన్నతాధికారులు తెలుసుకోవాలన్నారు. నేటి ఐచ్ఛిక సెలవును పాఠశాల మొత్తానికి ప్రకటించుకునేలా తగు ఆదేశాలు జారీ చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌. మహబూబ్‌ బాషా, టి. గోపాల్‌ రావు, గడివేముల మండల శాఖ అధ్యక్షుడు ఎం. ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల బాలస్వామి, సీనియర్‌ నాయకులు ఎస్‌. శ్రీనివాసులు, వి. సుబ్బరాయుడు, జి. వెంకటేశ్వర్లు, పి. మల్లికార్జునయ్య, వినయ్‌ కుమార్‌, కళ్యాణ్‌, చిన్నయ్య, ప్రసన్నలక్ష్మి, ఆదిశేషమ్మ, భూషమ్మ, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్యూ కట్టిన స్ప్రేయర్లు



కోడుమూరులో మెకానిక్‌ షాపు ముందు మరమ్మతుల కోసం క్యూలో ఉంచిన స్ప్రేయర్‌ పంపులు

కోడుమూరు రూరల్‌: ఎక్కడైనా నీళ్ల కోసం బిందెలను క్యూలో పెడతారు లేదంటే జనాలు క్యూలో ఉంటారు. అయితే కోడుమూరులోని ఓ మెకానిక్‌ షాపు ముందు మరమ్మతుల కోసం పొలాలకు మందులు పిచికారీ చేసే స్ప్రేయర్‌ పంపులు క్యూ కట్టాయి. ఖరీఫ్‌ సీజన్‌ కింద సాగు చేసిన పంటలకు ప్రస్తుతం చీడపీడలు, తెగుళ్లు సోకుతుండడంతో వాటి నివారణ కోసం రైతులు పురుగు మందులను పిచికారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో స్ప్రేయర్‌ పంపులను మరమ్మతులు చేయించేందుకు ఆయా గ్రామాల రైతులు మెకానిక్‌ షాపుల వద్దకు పోటెత్తుతున్నారు. కోడుమూరులోని ఓ దుకాణం ముందు స్ప్రేయర్‌ పంపులను మరమ్మతులు చేయించేందుకు ఇలా క్యూలో ఉంచారు. తమ వంతు ఎప్పుడు వస్తుందోనని రైతులు మాటిమాటికి వచ్చి స్ప్రేయర్‌ పంపులను చూసుకుంటూ ఎదురుచూస్తున్నారు.